క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడంతో బుధవారం స్థానికులు ఘనంగా సన్మానించారు. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు నర్సింలు, గణిత శాస్త్రం ఉపాధ్యాయురాలు గీతా రాణిలను స్థానిక, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మాజీ ఎంపీటీసీ నరేందర్, గ్రామ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

వసతిగృహం ఆకస్మిక తనిఖీ



కూరగాయలను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్

నారాయణఖేడ్: పట్టణంలోని సమీకృత బాలుర వసతిగృహాన్ని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, కూరగాయలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, హాజరుపట్టికలు, రికార్డులు, మెను పరిశీలించారు. మెను ప్రకారం భోజనాలు, ఆహార పదార్థాలను అందిస్తున్న విషయంపై ఆరాతీశారు. ఆయావాటిపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ సీజనల్ వ్యాధుల సీజన్ కావడం వల్ల అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని వసతిగృహాల సంక్షేమ అధికారులు రవీందర్, పండరిలకు సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నగేష్ షెట్కార్

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కిరణ్‌సింగ్‌కు, కంగ్టి మండలం చౌకాన్‌పల్లికి చెందిన అనంత్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. బుధవారం బాధితుల కుటుంబ సభ్యులకు ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ సీఎంఆర్ఎఫ్ చెక్కులుఅందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, నాయకులు సాయిలు, కొండల్ రెడ్డి, నారాయణజాదవ్ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



వినాయకుడిని దర్శించుకుంటున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: అన్నదానం గొప్పదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ,నాగుల కట్ట, శివాలయం తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం నియోజవర్గానికి చెందిన 45 మంది ఉపాధ్యాయులను క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓలు పీపీరాథోడ్, జెమినీ కుమారి, క్లబ్ సభ్యులు కృష్ణ, శ్రీధర్, మణికంఠ, వెంటేశ్వర్లు, తెలంగాణ మోడల్ స్కూల్ హెచ్ఎం రమేష్ పాల్గొన్నారు.

కల్తీపై నిఘా కరువు



మార్కెట్‌లో వివిధ రకాల కంపెనీల తిను బండారాలు

- అనారోగ్యం పాలవుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

పటాన్‌చెరు టౌన్: కల్తీ తిను బండారాలతో పిల్లల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విషతుల్యమైన రసాయనాలతో కూడిన చిరుతిళ్లు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. ఎలాంటి గుర్తింపు లేని కొన్ని కంపెనీలు స్వలాభం కోసం మార్కెట్‌లోకి తీసుకొచ్చి దర్జాగా విక్రయిస్తున్నారు.

ఆకర్షణీయమైన ప్యాకెట్లలో విక్రయం

వివిధ చోట్ల తయారు చేసిన తిను బండారాలు హైదరాబాద్ బేగంబజార్‌కు వస్తున్నాయి. తిరిగి అక్కడి నుంచి జిల్లాకు వస్తున్నట్లు సమాచారం. నాసిరకం తిను బండారాలపైనే ప్రతి రోజూ రూ. వేలల్లో వ్యాపారం జరుగుతోంది. అయితే వీటిలో కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ కేంద్రాల నుంచి మారుమూల గ్రామాల వరకు సైతం ఇవి విస్తరించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఎదుట ఏర్పాటు చేసిన దుకాణాల్లో కేవలం రూ. 2, రూ.5కే ఇవి లభిస్తున్నాయి. మార్కెట్‌లో బ్రాండెడ్ కంపెనీలను మినహాయిస్తే పలు నాసిరకం కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్ట కొచ్చాయి. తిను బండారాలకు రంగులు, చాట్ మసాలా వేసి రంగు, రుచిని జోడిస్తున్నారు. దీంతో పిల్లలు వాటినే ఇష్టంగా తింటున్నారు. చిన్నారులను ఆకర్షించేందుకు రంగుల బొమ్మలను ముద్రించి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకెట్లలో కల్తీ ఆహార పదార్థాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అధికారులు స్పందించాలి



కవర్ల మీద ఉన్న రంగుల బొమ్మలతో పిల్లలు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. అల్లరి చేసినప్పుడు చేతిలో డబ్బులు పెడితే చాలు దుకాణంలోని చిరుతిళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి తినకూడదని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. మార్కెట్‌లో నాసిరకమైన అహార పదార్థాలు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కిరణ్ కుమార్, పటాన్‌చెరు

జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది



పిల్లలు కల్తీ చిరుతిళ్లు తినడం వల్ల ఆకలి సరిగా కాకపోవడం, కడుపులో నట్టలు తయారై పిల్లల జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఇబ్బందులు వస్తాయి. తల్లిదండ్రులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి. సాధ్యమైనంత వరకు పిల్లలకు నాణ్యమైన పోషకాహారం ఇస్తే మెదడు ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

– డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ప్రభుత్వ ఆస్పత్రి

16 నుంచి పీర్ బాబా ఉర్సు



విద్యుత్ కాంతుల్లో దర్గా

పుల్కల్(అందోల్) : మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈనెల 16, 17, 18వ తేదీల్లో హజ్రత్ మహ్మద్ పీర్ బాబా షా వలీ ఉర్సు ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ తెలిపారు. 79 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు కుల మతాలకతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించినట్లు తెలిపారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్‌ను తీసుకొని దర్గాలోకి తీసుకెళ్లే కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 17న కబడ్డీ, వాలీ బాల్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం నాతే మై ఫీల్ సమ, అన్నదాన వితరణ ఉంటుందని తెలియజేశారు. ముఖ్యఅతిథులు అన్న సాగర్ పీఠాధి పతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని స్పష్టం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పత్తిలో నిల్వ నీటిని బయటికి తీయండి



ఎంపల్లి శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పత్తిపంటలో అధిక వర్షాలతో నిలిచిన నీటిని కాల్వలు తీసి బయటకు తీయాలని ఖేడ్ డివిజన్ ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపల్లి గ్రామ శివారులో పత్తి పంటను ఆయన ఏఓ వెంకటేశంతో పాటు పరిశీలించారు. అధిక వర్షాలతో పత్తి పంటలో వేర్లకు బూజుతెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు కార్బన్‌డైజమ్, మాంకోజెబ్ ఫంగీసైడ్ స్ప్రేయర్ నాజిల్ తొలగించి మొక్కల మొదళ్లలో పడేటట్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు బొరాలే కిష్టారెడ్డి, రాంరెడ్డి, హుస్సేన్‌సాబ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

కంది(సంగారెడ్డి): మిషన్ భగీరథ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కాశీపూర్‌లో మిషన్ భగీరథ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు 10 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. పదేళ్ల నుంచి పని చేస్తున్నా కార్మికులకు నేటికీ రూ.9,500 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, నర్సింలు, లక్ష్మణ్, యాదయ్య, లింగం, సాయికుమార్, సదానందం, కార్మికులు పాల్గొన్నారు.

పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయండి



అమృతరావును సన్మానిస్తున్న సురేందర్ తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నూతనంగా ఎన్నికైన బీహెచ్ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అమృతరావును ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. అనంతరం అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన తమ కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు అమృతరావును మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. బెల్ పరిశ్రమ అభివృద్ధిలో ప్రత్యేక చొరవ చూపిస్తూ, యాజమాన్యంతో హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చినట్లు వివరించారు. ప్రతి విషయంలో రాష్ట్ర కమిటీ తమకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపాధ్యక్షులు రవి కుమార్, ఉపాధ్యక్షులు కొడాలి సురేష్, కోశాధికారి నరసింహులు, జాయింట్ సెక్రటరీ స్వామిదాస్, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సంతోష్‌రెడ్డితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఖమ్మంలో వరద ముంపునకు గురైన ప్రాంతానికి ఇటీవల పరామర్శించడానికి వెళ్లిన క్రమంలో సంతోష్‌రెడ్డి అక్కడ జరిగిన ఘర్షణలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులతో కలిసి హరీశ్‌రావు సంతోష్‌రెడ్డిని పరామర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధికార పార్టీ నాయకులు తమ కార్యకర్తలపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే కుమారుడి మృతి

పోలీస్‌స్టేషన్‌లో శిశువు తండ్రి ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని ఓ తండ్రి సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన ప్రభు లింగం తమ రెండో కుమారుడు ధనుష్విక్ (45 రోజులు) అనారోగ్య సమస్యతో 5వ తేదీ సంగారెడ్డి బైపాస్లోని శిశు రక్ష ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తకణాలు పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమించి 9 వ తేదీ వైద్యుల సూచన మేరకు నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంగారెడ్డి శిశురక్ష ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బాలుడు మృతి చెందాడని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్‌ను వివరణ కోరగా బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన విషయం వాస్తవమే.

నూతన నియామకం



నూతన కమిటీ ఇదే..

పటాన్‌చెరు: పటాన్‌చెరు రికాగ్నైజ్డ్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయితేజను ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని ఇస్నాపూర్ సెయింట్ మేరీస్ గ్రామర్ హైస్కూల్‌లో (పీఆర్ఎస్ఎంఏ) ఎన్నిక నిర్వహించారు. ఇందులో దాదాపు 50 స్కూల్స్ యజమాన్యాలు పాల్గొన్నాయి. టీఆర్ఎస్ఎంఎస్ రాష్ట్ర ట్రెజరర్ రాఘవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఎన్నిక జరిగిందని సమన్వయకర్త విలియం తెలిపారు. ఎన్నికల్లో పటాన్‌చెరు పట్టణంలోని విద్యా భారతి హై స్కూల్ కరస్పాండెంట్ సాయితేజ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని వివరించారు. ముత్తంగి సాయి చైతన్య స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి జనరల్ సెక్రటరీగా, బీరంగూడ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ నాగిరెడ్డిని ట్రెజరర్‌గా ఎన్నుకున్నట్లు చెప్పారు.

పరిశుభ్ర వాతావరణం నెలకొల్పాలి

- మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్

సంగారెడ్డి : అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి- నీలి ఆకాశం దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి మున్సిపల్ అధికారులు బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారాబోసినా, కాల్చివేసినా జరిమానాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అహ్మద్, కాలుష్య నియంత్రణ మండలి కన్సల్టెంట్ స్వాతి, మెప్మా, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భారతీ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



మాట్లాడుతున్న అధికారులు

సంగారెడ్డి టౌన్ : భారతీ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని భారతీ సిమెంట్ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీ సిమెంట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. వికాట్ గ్రూపుకి చెందిన భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ను తెలంగాణలో విడుదల చేసిందని, వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 13 దేశాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడుతారని నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజింగ్ మార్కెటింగ్ సతీష్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, కిషన్ కాంత్, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరుల భరతం పడతాం

- పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నిజమైన జర్నలిస్టులకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం అక్రిడేటెడ్ జర్నలిస్టులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో పెరిగిపోతున్న నకిలీ విలేకరుల ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విలేకరుల మని ప్రచారం చేసుకుంటూ బిల్డర్లను బెదిరిస్తున్న వ్యక్తులపై ఇటీవల కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గత వారం విప్లవ్ అనే వ్యక్తిని అరెస్ట్ చే యగా, బిల్డర్‌ను డబ్బులు డిమాండ్ చేసిన విషయంలో రెండు రోజులు క్రితం రాము అనే నకిలీ విలేకరిపై అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు న మోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన జర్నలిస్టులు ఒక లిస్టు తయారు చేసుకోవాలని సూచించారు. నకిలీల ఏరివేతకు అక్రిడేటెడ్ జర్నలిస్టులు అన్ని శాఖల ప్రభుత్వాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఎలాంటి అర్హత లేకుండా, విలేకరులమని చెప్పుకుంటూ వ్య వస్థను కలుషితం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని అక్రిడేటెడ్ జర్నలిస్టులు డీఎస్పీని కోరారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

నారాయణఖేడ్: మనూరు మండలం తోర్నాల్ గ్రామంలో శివశక్తి ఆధ్వర్యంలో శ్రీపాల్ సహకారంతో బుధవారం భగవద్గీత పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశక్తి జిల్లా కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ భగవద్గీతను చదవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి, దత్తురెడ్డి, పండరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి టౌన్ : వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ కథనం మేరకు.. నిజామాబాద్ పట్టణానికి చెందిన జనార్దన్ (43) సంగారెడ్డి పట్టణంలోని సాయి కృష్ణ నగర్‌లో నివాసం ఉంటూ ఎంఆర్ఎఫ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. 4వ తేదీన భార్య లావణ్యతో గొడవపడి ఇంట్లో నుంచి బైక్ తీసుకొని బయటకు వెళ్లాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

◆ సింగూరుకు ఇన్‌ఫ్లో

–ఒక గేట్ ఎత్తి నీటి విడుదల

పుల్‌కల్(అందోల్) : సింగూరు ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో బుధవారం 11 నంబర్ గేట్ ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టులోకి సాయంత్రం 5,829 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా క్రస్టు గేట్ ద్వారా 8,142 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జలవిద్యుత్ కేంద్రంలో రెండు టర్బైన్‌లు రన్ చేసి 2,842 క్యూసెక్కులు నీటినితో 0.5 మిలియన్ యూనిట్‌ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

◆ కబ్జాకు గురైన నల్లవాగు పరిశీలన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులో ఓ వెంచర్ మీదిగా వెళ్తూ ఆక్రమణకు గురైన నల్లవాగును బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. వెంచర్ యాజమాన్యం సిబ్బందితో కలిసి సర్వేను అడ్డుకోవడంతో వాగు హద్దులు గుర్తించకుండానే అధికారులు వెనుదిరిగారు. ఉన్నతాధికారులకు వాస్తవ పరిస్థితిని వివరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతీ, ఇరిగేషన్ డీఈ బాలగణేశ్, ఏఈ మహేశ్, సర్వేయర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం జిల్లా అధ్యక్షుడు వెంకట హరిహర కిషన్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్‌కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడం, నేతన్నల రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు విశ్వనాథం, జానకీరామ్, యాదగిరి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

◆ హిందూ ధర్మం ఎంతో గొప్పది

జహీరాబాద్ టౌన్: హిందూ ధర్మం ఎంతో గొప్పదని విశ్వహిందూ పరిషత్ సత్సంగ్ రాష్ట్ర ప్రముఖ్ రాంరెడ్డి అన్నారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల హనుమాన్ మందిరంలో బుధవారం సత్‌సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాంరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు హిందూ ధర్మం గురించి వివరించాలని ఆయన కోరారు. దేవాలయాల్లో ధర్మ ప్రచారం ముఖ్యమని చెప్పారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు. సత్‌సంగ్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

◆ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సంగారెడ్డిలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని జనరిక్ మెడికల్ స్టోర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (40) స్పృహ లేకుండా పడి ఉన్నాడు. సెక్యురిటీ సిబ్బంది గుర్తించి ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందాడని తెలిపారు. కొద్ది రోజుల నుంచి ఆస్పత్రి చుట్టుపక్కల తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 8712656718 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

◆ అక్రమ కట్టడాలను తొలగించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నాలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు అధికారులను కోరారు. జహీరాబాద్ పట్టణంలో నాలాలను ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టారని అన్నారు. రాజకీయ నాయకులే నాలాలను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేసి పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారని ఆయన ఆరోపించారు. అధికారులు జహీరాబాద్ పట్టణంలో తనిఖీలు నిర్వహించి నాలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆయన కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమాన విధించింది. సోమ, మంగళవారల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 10 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

◆ సన్మానం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధి పటేల్‌గూడలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ఎస్జీటీ నాగేశ్వరికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన విషయం తెలిసింది. బుధవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లను కలవగా ఉపాధ్యాయురాలిని సత్కరించి అభినందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. సింగిల్ టీచర్‌గా పాఠశాలలో అన్ని సబ్జెక్టులను బోధిస్తూ.. ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచడం గొప్ప విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ దత్తాత్రేయ మహారాజ్‌కు పూజలు

మునిపల్లి(అందోల్): దత్తాత్రేయ మహారాజ్‌తో పాటు భ్రమరాంబ మల్లికార్జునస్వామికి అర్చకులు మేళసంగ్యం సంగమేశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మండలంలోని మగ్దుంపల్లి, కంకోల్ గుట్టపై ఉన్న శివాలయంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి, దత్తాత్రేయ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు.

◆ క్రీడాకారులకు పోటీలు

మునిపల్లి(అందోల్): మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు వేర్వేరుగా క్రీడా పోటీలను నిర్వహించామని ప్రిన్సిపాల్ సురభి చైతన్య, పీడీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల సమీపంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గీతా, రాజు, మన్సూర్, సతీశ్ గౌడ్, రాజ్‌కుమార్, అమృత, రవి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

◆ ఐక్య వేదిక సభను జయప్రదం చేయండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మల్కాజిగిరి జీఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం జరిగే బీసీ కులాల ఐక్య వేదిక ప్రథమ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు, గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ నగేశ్ బుధవారం పేర్కొన్నారు. సభకు అధిక సంఖ్యలో హాజరై బీసీల ఐక్యతను చాటాలన్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరు కానున్నట్లు తెలిపారు.